క్లుప్తంగా

చేపలు పట్టినవారిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మత్స్యకారులు

పెద్దపల్లిరూరల్: పాలితం, గోపయ్యపల్లి గ్రామాల శివారులోని పెద్ద చెరువు, పోతరాజు చెరువులో చేపలు పట్టుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘ అధ్యక్షుడు నేరేళ్ల స్వామి కోరారు. సంఘ సభ్యులతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలు చేపలు పట్టుకొని అమ్ముతూ జీవిస్తున్నారన్నారు. గోపయ్యపల్లికి చెందినవారే దొంగతనంగా చేపలను పట్టుకెళ్తున్నారని ఆరోపించారు. జిల్లా మత్స్యకార అధికారికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్లలో పని చేస్తున్న వివిధ సెక్షన్ల కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు ఇప్పించేలా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. చలపతినాయక్, లక్ష్మీ, కవిత, సమ్మయ్య, రాధమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు కళాకారుడికి ఉగాది పురస్కారం



అవార్డు అందుకుంటున్న సతీష్‌యాదవ్

ముత్తారం: లక్కారానికి చెందిన నర్ర సతీష్ యాదవ్ అనే ఒగ్గు కళాకారుడు ఉగాది పురస్కారం అందుకున్నాడు. గోదావరిఖనికి చెందిన బిట్ బిట్ డాన్స్ అకాడమీ, దేవా కళాబృందం ఆధ్వర్యంలో పెద్దపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు పొందాడు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందిస్తున్న ఎస్సై సతీష్

రామగుండం: పట్టణంలోని ముబారక్‌నగర్ బస్తీకి చెందిన ఇమ్రాన్‌ఖాన్ అనే యువకుడి ఫోన్ సండే మార్కెట్‌లో పోయింది. సదరు యువకుడు రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో సోమవారం సెల్‌ఫోన్‌ను గుర్తించి రామగుండం ఎస్సై కందునూరి సతీష్ బాధితుడికి అప్పగించారు. ఇటీవల కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ రూ.20వేల విలువుంటుందని, రామగుండం ఎస్సై, పోర్టల్ ఆపరేటర్ కె.కిరణ్ తదితరులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

రామగిరి: కల్వచర్ల గ్రామం నుంచి రత్నాపూర్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు ముల్కూరి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. నిత్యం దుమ్ము, ధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, రోడ్డు పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువైందని వాపోయారు.

పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం

- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంథని: మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని: చాలెంజ్‌గా చెబుతున్నాం.. నియోజకవర్గంలో పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తేనే రాబోయే ఎన్నికల్లో మీ దగ్గర ఓటడుగుతామని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. సోమవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో రామగుండం నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ తీసుకురావాలన్నారు. రామగుండం బీథర్మల్ పవర్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని అన్నారు. దీనికోసం కొన్ని రోజులుగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పట్టు వదలని విక్రమార్కునిలా పని చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, ఐటీహబ్‌గా చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, గడ్డం వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, నాయకులు హర్కార వేణుగోపాల్‌రావు, జనక్‌ప్రసాద్, బి.వెంకట్రావ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మంథని: రాష్ట్రంలో సాగునీరు, మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని, వర్షాభావం వల్ల సాగునీటి సమస్య తలెత్తుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి ఉంటుందని 2023లోనే వాతావరణ శాఖ, అనేక పత్రికలు ముందే చెప్పాయన్నారు. మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామ మాజీ సర్పంచ్ లావణ్యను ఇటీవల కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకోగా.. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సోమవారం లావణ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, వరుసగా మూడోసారి ఎవరూ ఊహించని మెజార్టీతో మళ్లీ ప్రధానిగా నరేంద్ర మోదీ ఖాయమని జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో సోమవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలందరికీ అందుతున్నాయని, వాటిపై గ్రామాలవారీగా విస్తృత ప్రచారం చేసి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలన్నారు. నాయకులు కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్, కేశవరావు, పిన్నింటి రాజు, సమ్మయ్య, శ్రీనివాసరావు, నరేశ్, రమేశ్, మల్లారెడ్డి తదితరులున్నారు.

నిలిచిన రహదారి పనులు



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా.. ఆలయానికి మండల కేంద్రం నుంచి పోచమ్మ కుంట కట్టపై వెళ్లే దారి విస్తరణ కోసం గతంలో నిధులు మంజూరయ్యాయి. నిధుల లేమితో రహదారి పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోరం లేక సమావేశం వాయిదా



సమావేశానికి హాజరైన పన్నూర్–2 ఎంపీటీసీ సభ్యుడు గణపతి

రామగిరి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరానికి సరిపడా సభ్యులు హాజరవ్వక వాయిదా పడింది. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. సమావేశానికి కేవలం ఒకే ఒక్క ఎంపీటీసీ పన్నూర్–2 ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల గణపతి మాత్రమే హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వేదికయిన మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి తగినంత మంది హాజరు కాక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శైలజారాణి తెలిపారు. మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులుండగా.. కనీసం నలుగురు సభ్యులు హాజరైతేనే సమావేశం నిర్వహిస్తారు. కానీ ఎంపీపీతోపాటు ఒకే ఒక్క ఎంపీటీసీ హాజరయ్యారు.

సీఐటీయూ ఉద్యమ నిధి సేకరణ



ఉద్యమ నిధి సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్: సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యమ నిధి సేకరించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద ఉద్యమ నిధి సేకరణ నిర్వహించారు. కేవీపీఎస్ ఉద్యమ నిధిలో భాగంగా సేకరించినట్లు నాయకులు వెల్లడించారు. రూ.3,398 నిధి సేకరించినట్లు చెప్పారు. గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, రాజ్‌కుమార్, మల్లేష్, యాకూబ్, పోచయ్య, శ్రీనివాస్, భూమయ్య, శ్రీనివాస్, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రి విద్యానికేతన్‌లో..



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో..

ముందస్తు ఉగాది వేడుకలు



కాల్వశ్రీరాంపూర్: వేదవ్యాస హైస్కూల్లో..



బసంత్‌నగర్ ఆలీవర్ పాఠశాలలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కళాశాలల్లో ముందస్తు ఉగాది(క్రోధినామ సంవత్సర) వేడుకలను సోమవారం జరుపుకున్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ లక్ష్మినర్సయ్య, అర్జున్, మనోజ్‌కుమార్ తదితరులున్నారు. గాయత్రీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో జరిగిన వేడుకల్లో ఉగాది పర్వదిన విశిష్టతను అర్చకుడు కొండపాక శ్రీనివాసాచార్యులు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, నవీన్, స్రవంతి తదితరులున్నారు. మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని విద్యార్థులు, హెచ్‌వోడీ, అధ్యాపకులకు అందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బూర్ల శ్రీనివాస్, ఏవో పవన్‌కుమార్, రమేశ్, వంశీరాజ్, పద్మ, సవిత, శ్రీధర్ తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రతి పండుగను తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకుంటారని ఎంఈవో సురేందర్‌కుమార్ అన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ గ్రామంలోని ఆలీవర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా ఉగాది వేడుకలను నిర్వహించారు. కరస్పాండెంట్లు జాఫర్ బేగ్, ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అఫ్జల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వీట్ తినిపిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

అల్లా అందరినీ చల్లగా చూడాలి

మంథని: ముస్లింలకు అత్యంత పవిత్రమైనది రంజాన్ అని, అల్లా దీవెనలు అందరిపై ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా సోమవారం రాత్రి మంథనిలోని జామా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.



అన్నదానం చేస్తున్న ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధులు

చిన్నారులకు ఇఫ్తార్ విందు

రామగుండం: రంజాన్ పురస్కరించుకొని సోమవారం తబితా ఆశ్రమంలోని చిన్నారులకు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి సహపంక్తి భోజనం చేశారు. సొసైటీ ప్రతినిధి మద్దెల దినేష్, ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్ తదితరులున్నారు.



గోదావరిఖనిటౌన్: ఇఫ్తార్ విందులో ముస్లిం న్యాయవాదులు

ముస్లిం న్యాయవాదులకు..

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లిం న్యాయవాదులకు సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీష్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉంటారన్నారు. సోదర భావంతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, న్యాయవాదులు సంజయ్‌కుమార్, కిషన్‌రావు, భూమయ్య, ఉమర్, సలీం, మహిళా ముస్లిం న్యాయవాదులు పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ.. ముగ్గురికి గాయాలు



బందంపల్లి వద్ద బోల్తా పడ్డ కారు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు బందంపల్లి వద్ద సోమవారం లారీ కారును ఢీకొంది. రాజీవ్ రోడ్డుపై కారు బోల్తా పడగా.. కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మంగోపేటకు చెందిన న్యాయవాది సువర్ణ శిరీష, తన భర్త సువర్ణ రాజేంద్రశర్మ, కొడుకు ప్రద్యుమ్నశర్మతో కలిసి మంచిర్యాలకు బయల్దేరారు. మార్గమధ్యలో లారీని దాటుతుండగా.. వెనక భాగంలో లారీ ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పెద్దపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సోమవతి అమావాస్య పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో సోమవతి అమావాస్య సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ–భాగ్యలక్ష్మి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అన్నపూజ చేశారు. వ్యాపారులు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పూజారి మహేశ్‌కుమార్ అందజేశారు.

విరాళం అందజేత



నగదు అందిస్తున్న సత్యనారాయణగౌడ్

సుల్తానాబాద్: సుద్దాల గ్రామంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం రూ.25వేల ఆర్థిక సాయాన్ని సోమవారం ఆదర్శ మోటార్స్ యజమాని బూర్గు సత్యనారాయణగౌడ్ అందజేశారు. సుద్దాలకు చెందిన గీత కార్మికులు, గౌడ సంఘం నాయకులు కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఆలయ నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. స్పందించిన ఆయన తనవంతు సహకారంగా రూ.25వేలు అందించారు. జిల్లా పశు రిటైర్డ్ వైద్యాధికారి డాక్టర్ రాజన్న, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పడాల అజయ్‌గౌడ్, సుద్దాల గౌడ సంఘం నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, పలువురున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



సునీల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. సోమవారం అంతర్గాం మండల నూతన కమిటీని ప్రకటించిన సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి సమక్షంలో జిల్లా అధ్యక్షుడిని సన్మానించారు. మండల అధ్యక్షుడు బాణాల స్వామి, ప్రతినిధులు మాడ ప్రభాకర్‌రెడ్డి, బాలసాని సత్తయ్యగౌడ్, కంచు మూర్తిదాసు, గొల్లూరి పురుషోత్తం, మురుగేషన్, శ్రీనివాస్, గురజాల రామలక్ష్మణ్, ఆలకుంట మల్లేశ్, వేముల రాజ్‌కుమార్, ముద్దంగుల రాజేందర్, ఆలకుంట రమేశ్, రాంబాబు, వినయ్, శివ, అనిల్, మల్లంపల్లి రవి, సాయి, ఏకే ఖాన్, శివ, తాపాల మల్లేష్, ఆలకుంట శ్రీనివాస్ తదితరులను అభినందించారు.

రంజాన్ సందర్భంగా పారిశుధ్య పనులు

సుల్తానాబాద్: పలు కాలనీల్లో మసీదుల వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు అపరిశుభ్రంగా ఉందని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ, కమిషనర్ వేణుమాధవ్ దృష్టికి ముస్లిం కమిటీ సభ్యులు తీసుకెళ్లగా.. మున్సిపల్ కార్మికులను పంపించి పనులు ప్రారంభించారు. ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని చెప్పారు. కౌన్సిలర్ గొట్టం లక్ష్మి, నాయకుడు గొట్టం మహేశ్, ముస్లిం కమిటీ సభ్యులు సాజిద్, తాహిర్ తదితరులున్నారు.

ఆలయ వేడుకలకు ఆహ్వానం



రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట కొండపై ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 13న నిర్వహించే 28వ ఆలయ వార్షిక వేడుకల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌కు అందజేశారు. కమిటీ ప్రతినిధులు కలవేని మల్లేశం, బందారపు బుగ్గరాములుగౌడ్, కె.కుమారస్వామి తదితరులున్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



రాజమ్మ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న నాయకులు

ముత్తారం: లక్కారంలో అనారోగ్యంతో మృతిచెందిన బర్ల రాజమ్మ నేత్రాలను కుటుంబీకులు అందజేయడం అభినందనీయమని మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో మృతురాలి భర్త రాజయ్య, కుమారులు లింగయ్య, సదానందంను సదాశయ ఫౌండేషన్, లయన్ క్లబ్ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. అభినందన పత్రం అందజేశారు. నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుందన్నారు. నేత్రదానానికి ప్రోత్సహించిన అయిలి మధు, బర్ల శ్రీనివాస్‌ను అభినందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ ప్రతినిధి నల్లవెల్లి శంకర్, రామకృష్ణారెడ్డి, రాజామౌళి, నూక రమేశ్, బండ్ల రమేశ్, రవీందర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పాలకుర్తి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో శశికళ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని కార్యాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, ఏపీఎం కొంరయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సిబ్బంది సంపత్, తిరుపతి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

రామగుండం: ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో.. ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి గంగలక్ష్మి కోరారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల గ్రామ పరిధిలో ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లారు. ఆరోగ్య సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వీటిని నీటిలో కలుపుకొని తాగడంతో శక్తి పొందే అవకాశముంటుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ బర్పటి సురేశ్ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి: బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహిళలకు ఆర్థిక ద్రవ్యోల్బనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత ఫైనాన్షియల్ లిట్రసీ సంధ్య హాజరై మాట్లాడారు. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలను వివరించారు. అర్హులైన ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ హరితభవాని, సూపర్‌వైజర్ దేవాంజలి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వేడుకల్లో సింగరేణి జీఎం శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి రామగుండం రీజియన్–1 జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదువులో రాణించాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెయింట్ క్లేయిర్ పాఠశాల నిర్వాహకులు జి.రాయప్పరెడ్డి, సెక్రెడ్ హార్ట్ పాఠశాల కరస్పాండెంట్ లవ్లీ జాకబ్, ప్రిన్సిపాల్ జోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జి ఇన్నమ్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ జోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి: కుక్కలగూడూర్, వేంనూర్ గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ఐకేపీ ఏపీఎం సదానందం ప్రారంభించారు. మండల పరిధిలోని గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాలవారీగా కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, రైతులు ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సదానందం కోరారు. ఆయా కేంద్రాల నిర్వాహకులు, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. నిరుపేదలైన వారి కుటుంబానికి విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకుడు వినోద్‌రెడ్డి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, చంద్రయ్య, అహమద్ తదితరులున్నారు.